తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అకాల వర్షం.. నిమ్మ, మామిడి పంటలకు అపార నష్టం





బాలాయపల్లి, మే 4, ప్రభాతవార్త
అకాల వర్షం పెనుగాలులతో మండలంలో నిమ్మ మామిడి పంటలకు అపార నష్టం వాటిల్లింది. మండలంలోని నిండలి, మన్నూరు, కోటంబేడు గ్రామాల్లో పంటలు పెనుగాలులకు ధ్వంసం అయ్యాయి. నిండలి గ్రామంలో మామిడి తోటలో కాపు రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామిడి తోటల కొమ్మలు కూడా పెనుగోలుకు విరిగిపడ్డాయి. మన్నూరు గ్రామంలో నిమ్మ తోటలకు అపార నష్టం వాటిల్లింది. గాలివానకు నిమ్మ చెట్లు వేర్లతో కూడా లేచిపోయాయి. కోటంబేడు గ్రామంలో అరటి తోటలో పెనుగాలులకు పడిపోయాయి. పంటల ధ్వంసం కావడంతో రైతులు కనీన్నీరు అయ్యారు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



తవణంపల్లి, మే 4 ప్రభాతవార్త :
ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నలిశెట్టిపల్లి పంచాయతీ కర్ణం వాండ్ల ఊరులో ఆదివారం రాత్రి జరిగింది. సంఘటనకు సం బంధించి స్థానిక ఎస్సై రమేష్ బాబు కథనం మేరకు.. చిత్తూరు నగరం సంతపేటకు చెందిన ఆర్ నాగరాజు కుమారుడు ఎన్. లోగిత్(10) అనే బాలుడు వేసవి సెలవులు రావడంతో కరణం వాండ్ల ఊర్లోని తమ బంధువులు బుజ్జమ్మ ఇంటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో బుజ్జమ్మ ఇంటి విద్యుత్ మీటర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్ కు గురయ్యాడు. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

# ఇసంగాడు గ్రామంలో విషాదం

### బావిలో మునిగి ఇద్దరు బాలురు దుర్మరణం



నాగలాపురం, మే 4 ప్రభాతవార్త:
నాగలాపురం మండలం ఇసంగాడు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. వేసవి సెలవుల సందర్భంగా బంధువుల ఇంటికి వచ్చిన ఇద్దరు చిన్నారులు బావిలో పడి మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇసంగాడు గ్రామానికి చెందిన సుభాషిణి ఇంటికి ఆమె చెల్లెలు పిల్లలు హర్షవర్ధన్(11), ఛరణ్(12) రెండు రోజుల క్రితం సెలవులకు వచ్చారు. సోమవారం మధ్యాహ్నం సుభాషిణి కుమారుడు ఆదికేశవులు ఈ ఇద్దరు పిల్లలతో కలసి ఏపీ అగ్రికల్చర్ ఫారం పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమి వద్దకు భోజనం తీసుకెళ్లాడు. అక్కడ సమీపంలోని బావి వద్ద ఆడుకుంటున్న సమయంలో హర్షవర్ధన్, ఛరణ్‌లు అదుపు తప్పి బావిలో పడిపోయారు. ఈత రాని ఆదికేశవులు వెంటనే కేకలు వేస్తూ స్థానికులను, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నాగలాపురం ఎస్ఐ సునీల్, కానిస్టేబుల్ భూపతి, సాయికృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని బావిలోకి దూకి చిన్నారులను బయటకు తీశారు. చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ విషాద ఘటనతో గ్రామంలో తీవ్ర శోకసంద్రం నెలకొంది. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యవంతమయ్యారు.

**ప్రాణాలను కాపాడేందుకు పోలీసుల సాహసం**

ఇద్దరు చిన్నారులు బావిలో పడిపోయారన్న సమాచారం అందుకున్న పోలీసులు రక్షణ చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుళ్లు భూపతి, సాయికృష్ణ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బావిలోకి దూకి చిన్నారులను కాపాడేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. అయితే వారి ప్రయ త్నాలు ఫలించకపోవడంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ రక్షణ చర్యలు చేపట్టిన కానిస్టేబుళ్ళను అభినందించారు.

# డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం.. నలుగురి ప్రాణాలు గాలిలో . . .

### వైద్యానికి వెళ్తూ గమ్యం చేరే లోపలే శివైక్యం!

శ్రీకాళహస్తిరూరల్, మే 4 ప్రభాతవార్త
వెస్ట్‌బెంగాల్‌కు రాధాకృష్ణపూర్ రాజహటి బందర్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన నలుగురు వైద్య సహాయం కోసం అంబులెన్స్‌లో బయలు దేరారు. ఈ నెల 2వ తేది అంబులెన్స్‌లో బయలుదేరిన వారికి అదే ప్రాంతానికి చెందిన అంబులెన్స్ అన్నదమ్ములను మాట్లాడుకున్నారు. బ్రజా డోలాయి (43)కు అస్వస్థతకు గురి అయ్యారు. ఆయన ఆస్తామాతో బాధపడుతూ బెస్ట్ బెంగాల్‌లో వైద్య కోసం వెళితే ఖర్చులు అధికమని బెంగుళూరులోని ఆస్పా ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో వైద్యసేవలు పొందవచ్చుని భావించి బయలుదేరారు. బెంగాల్‌కు బెంగుళూరులో ఖర్చులు లక్షల్లో తేడా ఉండటంతో బయలు దేరారు. ఆదివారం బయలు దేరిన వారు సుమారు 1598 కిలో మీటర్లు పయనించి సోమవారం వేకువ జాము 3.30గంటలకు శ్రీకాళహస్తి పొలిమేరలకు చేరారు. అప్పుడు అంబులెన్స్‌ను రాకేష్ పండిట్ నడుపుతున్నారు. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో కలసి ఆరు మంది ఉన్నట్లు కేసు దర్యాప్తు చేస్తున్న సిఐ ఇబ్రహీం తెలిపారు.

**నిద్రమత్తులో . . .**

అంబులెన్స్ ఎంత వేగంతో వెళుతుందో ఏమో తెలియదు కానీ హఠాత్తుగా అంబులెన్స్ ఏదో వాహనానికి ఢీకొన్న శబ్దం. కనురెప్పపాటులో నాలుగు ప్రాణాలు గాలిలో కలిసాయి. నాయుడుపేట-పూతల పట్టు జాతీయ రహదారి(ఆరులేన్లు) శ్రీకాళహస్తి పొలిమేరల్లో ఓ పెద్ద వాహనం పార్కింగ్ చేసి ఉండగా దానికి అంబులెన్స్ ఢీకొంది. దాంతో అంబులెన్స్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. శబ్దం విన్న వారు మేల్కొని చూసే లోపల అంబులెన్స్ నుజ్జు నుజ్జు కాగా కకావికలమై రోడ్డ మీద అడ్డంగా పడిన శవాలు. ఈ దృశ్యం చూడటానికే ఎంతో హృదయవిదారకంగా మారింది. అంబులెన్స్‌లో పయనిస్తున్న బ్రజా డోలాయి (48) టగారి డోలాయి(35), రితేష్ పండిత్(24), జతిన్ డోలాయి (63 విగత జీవులుగా మారారు. అంబులెన్న్ నడుపుతన్న రితిష్ పండిట్ తప్పించుకోగా పక్కనే కూర్చొన్న మరో డ్రైవర్ మృత్యుపాలయ్యాడు. చనిపోయిన వారిలో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా రితేష్ పండిట్ సహాయంగా వచ్చిన సహాయకురాలు. ఇక ఈ ప్రమాదంలో గాయపడిన ధడోడిస్ (45) రాకేష్ పండిట్‌లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనను పోలీసులు వారి స్వగ్రామానికి సమాచారం చేర్చగా అక్కడ విషాదం చోటు చేసుకున్నట్లు గుర్తించారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బెంగాల్ వాసులు

బంధువులు విమానంలో వస్తారని పోలీసులకు సమాచారం అందింది.

**పరుగులు తీసిన పోలీసులు:**

సంఘటన సమాచారం తెలిసిన వెంటనే డివైయస్‌పి నరసింహా మూర్తి రూరల్ సిఐ ఇబ్రహీం, ఎస్ఐ వెంకటేష్, వారి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా పడి ఉన్న శవాలను శ్రీకాళహస్తి ఏరియ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన బాధితులను వైద్య సదుపాయానికి ఆసుపత్రికి తరలించారు. బెంగాల్‌లో వైద్యానికి ఖర్చులు భరించలేక బెంగుళూరులో కలసి వస్తుందని వెళుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. వీరే కాకుండా ఇంకా ౦రెండు మూడు అంబెలెన్స్‌లలో బయలుదేరినట్లు సిఐ ఇబ్రహీం వివరించారు. శ్రీకాళహస్తికి సమీపంలోని బైపాస్ రోడ్డు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవలే కలెక్టర్, ఎస్‌పిలు బ్లాక్ పాయింట్స్‌ను పరిశీలించారు. అయితే సోమవారం వేకువ జామున జరిగిన ప్రదేశం బ్లాక్ స్పాట్ కాదని పోలీసులు గుర్తించారు.

# అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి

### రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీన్ మాధవ్ పిలుపు



వరదయ్యపాలెం, మే 4, ప్రభాతవార్త:
వరదయ్యపాలెం మండలంలోని గోవర్ధనపురంలో బీజేపీ జెండాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్ మాధవ్ సోమవారం ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమం కేవలం ఒక రాజకీయ కార్యక్రమం మాత్రమే కాదని, గ్రామీణ స్థాయిలో మార్పు, అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలిచింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరగడం ద్వారా పార్టీ శక్తి, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన సంకేతం ఇచ్చింది. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు విజయం పట్ల సంబరాలు జరుపుకుని, స్వీట్లు పంపిణీ చేయడం ద్వారా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మన ఊరు - మన జెండా కార్యక్రమం ద్వారా కేంద్రంలోని ఎన్ డి ఎ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం నినాదం కాదు, గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేసే ఉద్యమంగా మారుతోంది. మండల అధ్యక్షుడు ఢిల్లీ ప్రకాష్ (దిలీప్ రాయల్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులను డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు ఘనంగా సత్కరించారు. తద్వారా స్థానిక నాయకత్వం యొక్క ఆతిథ్యభావం, సమన్వయం ప్రతిఫలించింది. మన ఊరు మనజెండాకు విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులను గజమాలతో ఓబిసి మోర్చా కార్యదర్శి మురళి, మన ఊరు మన జెండా కార్యక్రమానికి సంహరించిన ఓబీసీ మోర్చా కార్యదర్శి మురళిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మునిసుబ్రహ్మణ్యం, బీసీ నాయకుడు జల్లి మధుసూదన్‌లు అభినందించారు. అలాగే స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు పి. యుగంధర్ రెడ్డి పాల్గొనడం రాజకీయ వైవిధ్యాన్ని, సమన్వయాన్ని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ చేసిన ప్రసంగం కార్యక్రమానికి హైలైట్‌గా నిలిచింది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతమే దేశ అభివృద్ధికి పునాది అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామాలకు చేరినప్పుడే నిజమైన మార్పు కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యదర్శిటి సిద్దులయ్య, భాస్కర్ రెడ్డి, శుభరత్నమ్మ, మాజీ మండల అధ్యక్షులుపురుషోత్తం, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎం జె కుమార్, మండల ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ , బి ప్రసాద్, బుగ్గల ఏసు, మండల ఉపాధ్యక్షులు బుగ్గల సుబ్రమణ్యం, బిగువు నాగేశ్వరావు, మాజీ ఎస్సీ మోర్చా కార్యదర్శి వై అన్వేష్, అంకయ్య, గోపి, వి పురుషోత్తం, జిల్లా కౌన్సిల్ మెంబర్ మునిశేఖర్, ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ ఆనంద నాయుడు, బుచ్చినాయుడు కండ్రిగ మండల అధ్యక్షులు దాసరి గురుస్వామి, కేవీపీ పురం మండల అధ్యక్షులు బాబు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# నేడు అర్ధరాత్రి గంగమ్మజాతర చాటింపు

### -తిరుపతిలో మొదలైన కోలాహలం



తిరుపతి, మే 4ప్రభాతవార్త:
తిరుపతి నగర గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మజాతర వారంరోజులు వైభవంగా జరగనున్నాయి. జాతర ఆరంభానికి శుభసూచకంగా మంగళవారం (నేడు) అర్ధరాత్రి చాటింపుతో జాతరకు శ్రీకారం చుడతారు. జాతర వేడుకలు వరుసగా ,బైరాగివేషం, బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగివేషం, సున్నపు కుండలు వేషం, చివరగా 12వతేదీ గంగజాతర వేడు కలు జరుగుతాయి. 13వతేదీ వేకువజామున పేరంటాలు అమ్మవారి ప్రతిమను చంప నరకడంతో ముగుస్తాయి. ఇందుకు ప్రభుత్వశాఖలన్నీ సిద్ధమయ్యాయి. ఆలయంలో ఏర్పాట్లు, క్యూలైన్లు, భక్తుల అనుమతి, వైద్యశిబిరాలు, తాగునీరు, పారిశుధ్యంపై నగరపాలకసంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ శారదాదేవి, గంగమ్మ ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్ యాదవ్, ఆలయ ఈఓ జయకుమార్, నగర పాలకసంస్థ ఆర్ఓ సేతుమాధవ్, డిఎస్పీ భక్త వత్సలం, సిఐలు రామకిశోర్, శ్రీనివాసులు పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లుపై సమీక్షించారు.

# సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మే 4 ప్రభాతవార్త:
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ద వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్. చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిపుయటీ కలెక్టర్ కరుణకుమారి, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కులశేఖర్, రూరల్ తహసిల్దారు కళ్యాణిలు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిశీలించి న్యాయపరమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు.



**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 235 సమస్యలు**

కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి సమస్యలపై ప్రజల నుండి అధికారులకు 235 అర్జీలు అందాయి. ఈ అర్జీల్లో అత్యధికంగా రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 186 అర్జీలు వున్నాయి. అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 19, పశుసంవర్ధకశాఖ 3, పోలీసు శాఖ 6, జిల్లా పంచాయతీ కార్యాలయం 2, పంచాయతీరాజ్ 2, జిల్లా విద్యాశాఖ కార్యాలయం 2, సివిల్ సప్లై 2, విద్యుత్ శాఖ 3, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ 2, వాటర్ రిసోర్స్ 4, దేవాదాయశాఖ 1, రూరల్ వాటర్ సప్లై 1, సైనిక్ వెల్ఫేర్ 1, ఇంజనీరింగ్ 1 వున్నాయి.

# ఘనంగా శ్రీ కోడెలరాయస్వామి పెద్ద జాతర

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సవిత !!
- కర్ణాటక.. తమిళనాడు..ఆంధ్ర నుంచి పోటెత్తిన భక్తులు !!
- జోరు వానలోను సాగిన జాతర.. తలలపై పగిలిన టెంకాయలు !!



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి సవిత, తలపై టెంకాయలు కొడుతున్న దృశ్యం

కుప్పం, మే 4 ప్రభాతవార్త
కుప్పం మండలం జరుగు, సలార్లపల్లి గ్రామాల మధ్య వెలసిన శ్రీ కోడెలరాయస్వామి, శ్రీ కుందాని లక్కమ్మస్వామి పెద్ద జాతర భారీ ఎత్తున ఘనంగా జరిగింది. ఈ జాతరకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి సవిత, ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రా ష్ట్ర కురబకుల అధ్యక్షుడు మల్లికార్జున, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత నాగులకు పాలు పోసే కార్యక్రమం జరిపారు. 11 ఏళ్లకు ఓ సారి జరిగే ఈ జాతరకు సంబంధించి వేలాది మంది కురబ కులస్తులు వెయ్యికి పైగా గుడారాలు వేసుకున్నారు. సోమవారం ఉదయం నుంచి వారి బంధుమిత్రులు పెద్ద ఎత్తున కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాలనుంచి చేరుకున్నారు. మధ్యాహ్నం ఆయా గుడారాల్లో తమ బంధువర్గాలకు విందు భోజనాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఒక్కో కుటుంబంకు జాతర ఖర్చు సుమారు 5-6లక్షల దాకా ఖర్చై ఉంటుందని అంచనా.

జోరు వానకు సైతం వెరవక : మొక్కులు కలిగిన భక్తులు, కురబ కులస్తులు పెద్ద ఎత్తున తలపై దీపాలు ఎత్తుకుని గుడారాల ప్రాంతం నుంచి ఆలయం వద్దకు చేరుకుని స్వామివారికి సమర్పించారు. సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసినా జాతర సందడి మాత్రం ఆగలేదు. భక్తులు వేల సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా మొక్కులు కలిగిన భక్తులు తలలపై టెంకాయలు పగలగొట్టుకున్నారు. రా త్రి సా ్వమివారికి పల్లకి ఉత్సవం, పచ్చిగెరిగ ఊరేగింపు నిర్వహించారు. అర్ధరాత్రి దీపం కన్పించాక గుడారాలు ఖాళీ చేయడం మొదలు పెట్టారు. జాతర సందర్భంగా గుడ్లనాయనపల్లి, జరుగు, సలార్లపల్లి, పొరకుంట్ల పల్లి గ్రామాల రహదారులు వాహనాలతో బారులు తీరాయి. అక్కడక్కడా ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలిగింది. పోలీసులు వాహనాలను కి ్లయర్ చేశారు. జాతర సందర్భంగా భారీగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# కోటలు దాటుతున్న మాటలు!

### -ఆచరణలో అస్సలు కనిపించని కూటమి ప్రజాప్రతినిధులు

ప్రభాతవార్త-తిరుపతి/చిత్తూరున్యూస్‌బృందం:
మాటలు కోటలు మా ఇంట్లో రాత్రి భోజనం మీఇంట్లో అనే చందంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూటమి ప్రజాప్రతినిధులు ఉలకరు పలకరు" అనే చందంగా వ్యవహరిస్తున్నారని కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీతోనూ, కార్యకర్తలతోనూ సంబంధం లేకుండా ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో వీచిన కూటమి గాలిలో గెలిచిన ప్రజాప్రతినిధులు, ఆ విజయాన్ని తమ వ్యక్తిగత ప్రతిభగా భావిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.
ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా, కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన దగ్గుమల్ల ప్రసాద రావు ఎన్నికల ముందు పార్టీలో చేరి చిత్తూరు లోక్‌సభ (ఎస్సీ) సభ్యునిగా గెలిచారు. 2019లో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి అయిన ఆయనకు డబ్బు ప్రభావంతో టికెట్ దక్కిందన్న విమర్శలు ఉన్నాయి. పార్టీ కోసం పూర్వం పనిచేయలేదన్న ఆరోపణల మధ్య, ప్రస్తుతం ఢిల్లీలోనే ఉంటూ పీఏల ద్వారా వ్యవహారాలు నడిపిస్తున్నారని అంటున్నారు. అదే విధంగా, బెంగళూరులో వ్యాపారాలు నిర్వహిస్తున్న చిత్తూరు ఎంఎల్ఏ కూడా భారీ నిధులతో టికెట్ సంపాదించి ఎమ్మెల్యేగా గెలిచారని విమర్శలు ఉన్నాయి. ఆయన అడపాదడపా తప్ప మిగిలిన సమయంలో తన అనుచరుల ద్వారానే పాలన కొనసాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీ-ఎమ్మెల్యే మధ్య సత్సంబంధాలు లేకపోవడంతో ఇటీవల రాజకీయ వివాదం చెలరేగింది. ఎంపీ టిడిపి కార్యకర్తలపై ఎస్సీ/ఎస్టీ కేసులు పెట్టించడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేయగా, చివరకు అధిష్టానం జోక్యం చేసుకుని రాజీ కుదర్చాల్సి వచ్చింది. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వైసిపి నుంచి వచ్చిన నేతల ద్వారా వ్యవహారాలు నడిపిస్తూ అసలు కార్యకర్తలను పక్కన పెడుతున్నారన్న ఆరోపణలు సంచలనమవుతున్నాయి. నగరి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో అప్పుడప్పుడు మాత్రమే పర్యటిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పూతలపట్టు ఎమ్మెల్యే కొందరు నేతలకు అధికారం అప్పగించి ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారని అంటున్నారు. పలమనేరు ఎమ్మెల్యే మంత్రి పదవి రాకపోవడంతో అసంతృప్తిగా ఉండి, బెంగళూరులోనే వ్యాపారాలపై దృష్టి పెట్టారన్న చర్చ సాగుతోంది. తిరుపతి జనసేన ఎమ్మెల్యే కార్యకర్తలను కూడా పట్టించుకోకుండా కుటుంబ సభ్యుల ద్వారా వ్యవహారాలు నడిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే ,శ్రీకాళహస్తి ఎమ్మెల్యేల తీరుపై జనంలో వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సత్యవేడు ఎమ్మెల్యే ఇప్పటికే పార్టీ నుండి సస్పెండ్ కావడం, తనను పక్కన పెట్టి సమన్వయకర్త శంకర్ రెడ్డి ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపిస్తూ తిరుగుబాటుకు సిద్ధమైన పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ కార్యకర్తల్లో నైరాశ్యం పెరుగుతోంది. టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు సీనియర్లను పక్కనబెట్టి కొత్తవారికి ప్రాధాన్యత ఇవ్వడం కూడా అసంతృప్తికి కారణమైందని వర్గాలు భావిస్తున్నాయి. ఇదే సమయంలో వైసిపి నేతలు సవాళ్లు విసురుతున్నా వాటికి సమాధానం చెప్పే నాయకత్వం కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, స్థానిక సంస్థల ఎన్నికల నుంచే పార్టీకి ఇబ్బందులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో

### అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు...

ఓబులవారిపల్లి మే 4 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ప్రజా సమస్యలకు సంబంధించిన ఆరు అర్జీలు వచ్చాయని డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు తెలిపారు. ముఖ్యంగా భూమి కొలతలు ఆన్లైన్ ఇంటి స్థలాలు తదితర సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు వచ్చాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు ఏవైనా అలాగే రైతులు సంబంధించిన సమస్యలు తమ దృష్టికి వస్తే వెంటనే పరిష్కారం మార్గాలు చూపుతామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారాలు చూపుతామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, మండల సర్వేయర్ నాగలక్ష్మి, వీఆర్వోలు శంకరయ్య, రాజు, మనోహర్, లక్ష్మయ్య, రాంబాబు కొర్లకుంట విఆర్ఓ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని యువకుడు దుర్మరణం..

### కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు



ఓబులవారిపల్లి మే 4 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఓబులవారిపల్లి రైల్వే స్టేషన్‌లో పుల్లంపేట మండలం కేతరాజు పల్లి గ్రామానికి చెందిన పులిహార మహేష్ (35) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవాలని రెడ్డిపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు పట్టాల పైన నిలబడ్డాడు. రైలు వేగంతో రావడంతో నోటిలో రైల్వే ఇంజిన్ పొన్న ఇనుపు చెవులు గుచ్చుకొని చనిపోయాడు. రెడ్డిపల్లి నుంచి ఓబులవారిపల్లి స్టేషన్ వరకు రైలు తగులుకొని శవం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నట్లు తెలుస్తోంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి సేవ పరీక్ష కోసం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు శవాన్ని అప్పగించినట్లు సమాచారం.

## ప్రజాసేవలో ముక్కా కుటుంబానికి తిరుగులేదు:: రూపానంద రెడ్డి



రైల్వేకోడూరు రూరల్, మే 4 ప్రభాతవార్త

ప్రజాసేవలో ముక్కా కుటుంబానికి తిరుగు లేదని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్క రూపానందరెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం టిడిపి కార్యాలయంలో రూపానందరెడ్డి జన్మదిన మరియు వివాహ మహోత్సవం కార్యక్రమాన్ని నియోజకవర్గ ఐదు మండలాల ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రైవేటు కల్యాణ మండపం లో కేక్ కటింగ్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో తనకు ఇన్చార్జిగా బాధ్యతలు ఇచ్చి వెన్ను తట్టడంతో అప్పటినుండి ఇప్పటివరకు అభివృద్ధిలో ఎటువంటి రాజీ లేకుండా ఎన్నో అవాంతరాలు ఎదురైన ఒక్కొకటి పక్కకు నెట్టుకుంటూ అభివృద్ధిని అజెండాగా చేసుకొని రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని ఐదు మండలాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేంతవరకు నిరంతరం ఒక శ్రామికుడిగా పనిచేస్తానని రూపానందరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాల ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని తప్పక నెరవేరుస్తూ అర్ధరాత్రి సైతం తలుపు తడితే లేచి పనిచేసే తత్వం తనకు ఉందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధిని సాధిస్తున్నామని త్రాగునీరు, సిమెంటు రోడ్లు మరియు మౌలిక వసతులు ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం భారీగా పాల్గొన్న మహిళలు ముక్కా రూపనంద రెడ్డిని ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మిలను గజమాలలతో, శాలువాలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ , రాష్ట్ర జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర,డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాష్, ముక్కా విశాల్ రెడ్డి, సాయి వికాస్ రెడ్డి, తల్లెం రమణారెడ్డి, బీసీ సంఘం నాయకులు కమతం నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంఘరాజు రవి కుమార్ రాజు, మాజీ సర్పంచులు కట్ట ఉమా, సంయుక్త, పుష్పలత, ముంతాజ్ మెహతాజ్ బేగం, తిప్పన రాజశేఖర్, జయచంద్ర, ముని పెంచల్‌రెడ్డి, చిట్టి, పరశురాం రెడ్డి, శివారెడ్డి తోపాటు కూటమికి సంబంధించిన నాయకులు పాల్గొన్నారు.

## మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం



పుల్లంపేట, మే 4 ప్రభాతవార్త :

పుల్లంపేట మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని రైల్వే కోడూరు నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి అన్నారు సోమవారం మండలానికి వచ్చిన ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తాగునీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. మండలంలో మిగిలి ఉన్న రోడ్లను ప్రభుత్వ భవనాలను నిర్మించేందుకు నాయకులు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం నాయకులు రూపానంద్ రెడ్డి ఆయన సతీమణి గజమాలతో సత్కరించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ బాధ్యుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు కావేటి వెంకటసుబ్బయ్య యాదవ్ కువైట్ బలిజ సంఘం అధ్యక్షుడు జిలకర మురళి రాయల్,పోలి జగదీశ్వర్ రెడ్డి అరే సుధాకర్ నాయుడు, పంజగల వెంకటసుబ్బయ్య శంకర్ రెడ్డి, అన్నపాల చంద్ర, సింగం ఆదినారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలి

### జిల్లా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభావతి



పెనగలూరు మే 4 ప్రభాతవార్త

ప్రతి కుటుంబం ఆర్థికం ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని వెలుగు జిల్లా అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ప్రభావతి పిలుపునిచ్చారు. సోమవారం పెనగ లూరు వెలుగు కార్యాలయం యానిమే టర్‌లు, సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. గ్రామ సమాఖ్యల వారీగా సమీక్ష చేశారు. గ్రామాలలో సంవత్సరిక జీవనోపాదుల ప్రణాళిక ద్వారా సర్వే నిర్వహించి వ్యాపారము చేసే వారికి ఎంత డబ్బులు అవసరమో కనుక్కొని బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. వారి అవసరాలకు అనుగుణంగా అదే ఆర్థిక సంవత్సరం లోనే లోను ఇస్తారని పేర్కొన్నారు. ఎన్ ఆర్ పురం, సిద్ధవరము, తిరుమలరాజు పేట గ్రామ సమాఖ్యలలో సర్వే పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ప్రాజెక్ట్ బ్యాంకు లింకేజి మేనేజర్ వనజాక్షి, ఎపిఎం నిరంజన్ కుమార్, సిసి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి - ఎంపీడీవో

కేవీబీ పురం, మే 4 ప్రభాతవార్త:

కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మాలతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందని తెలిపారు. కేవీబీ పురం మండలం, నియోజకవర్గంలో చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతి, యువకుల కోసం ఈఎంసీ క్లస్టర్, శ్రీసిటీ, తిరుపతి, చెన్నైలోని 12 బహుళ జాతీయ కంపెనీలల్లో 700పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతి, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి, యువకులు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతి, యువకులు హెచ్‌టీటీపీఎస్‌:/ /ఎన్ఏపీయూ ఎన్వైఎఎం.ఏపీ.జీవోవీ.ఇన్// రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కావున యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఎన్నికల ఫలితాలు మోడీ నాయకత్వానికి నిదర్శనం



చిట్వేలి, మే 4,ప్రభాతవార్త:

పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, అసోం రాష్ట్రాలలో భాజపా విజయం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి నిదర్శనమని అన్న మయ్య జిల్లా భాజపా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆకేపాటి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం చిట్వేలిలో పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలను ఆకేపాటి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచారు.అభివృద్ధితో పాటు నమ్మకమైన నాయకత్వానికి ప్రజలు పట్టం కడుతున్నారని ఆకేపాటి అన్నారు. క్లిష్ట పరిస్థితులను కూడా దేశ ప్రగతికి అనుకూలంగా మార్చుకోగల ధైర్యవంతుడు, దేశం గర్వించదగ్గ నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ అని పలువురు కొనియాడారు.కార్యక్రమంలో బిజెపి నాయకులు యన్నారు దిలీప్,నిర్మల, చంద్రశేఖర్ నాయుడు, హరినాథ్ గుప్తా,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## గ్రామ కంఠం భూమిని ఆలయానికి కేటాయించండి



వడమాలపేట, మే 4 ప్రభాతవార్త:

వడమాలపేట మండలంలోని సీతారామపురం లో ఆక్రమణలో ఉన్న మూడు సెంట్ల స్థలాన్ని వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కేటాయించాలని గ్రామస్తులు తహసీల్దార్ జరీనాకు విన్నవించారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సీతారామపురం గ్రామంలోని పెద్దలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తూ గ్రామకంఠం ఆక్రమణ తొలగించి ఆలయానికి అందజేయాలని కోరారు. సోమవారం నాలుగు అర్జీలు వచ్చాయని రెవెన్యూ పరంగా మూడు, సీతారామపురం గ్రామకంఠం సమస్య ఒకటిని తహసీల్దార్ తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు గోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఆక్రమణ తొలగించాలంటూ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో శేషగిరిరావు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఆధ్వర్యంలో ఎల్ఐసి రోడ్డులో పింక్ బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



**తిరుపతి హెల్త్, మే 4, ప్రభాతవార్త** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి ఎల్ఐసి రోడ్డు సచివాలయం పరిధిలో పింక్ బస్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతున్నాయి. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్ మరియు పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం రోడ్ అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతి కుమార్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు మునికుమారి, వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం



తిరుపతి హెల్త్, మే 4, ప్రభాతవార్త

ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆస్తమా వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు ఎస్ వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి నందు శ్వాసకోశ వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడునని ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం నందు శ్వాసనాలాల సామర్ధం తెలుసుకునే పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ, ఆస్తమా తీవ్రతను గురించి అందరికీ అవగాహన కల్పించబడునని తెలిపారు. ప్రతి సంవత్సరం మే నెల మొదటి మంగళవారం జరుపుకునే ఈ దినోత్సవం ఉద్దేశ్యం ఆస్తమా వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడం. ఆస్తమా అనేది శ్వాసనాళాల్లో దీర్ఘకాలిక వాపు వల్ల కలిగే వ్యాధి. ఆస్తమా లక్షణాలుశ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, ఛాతీలో బిగుతు, పిల్లి కూత శబ్దాలు ఊపిరి సలపకపోవడం వంటివి. ఇవి తరచుగా కనిపిస్తున్నాయా ఆస్తమా కావచ్చు. ఆస్తమా వ్యాధి లో శ్వాసనాలాల వాపుని నియంత్రణ చెసే స్టీరాయిడ్ (ఇన్హేలర్)మంధు అందరికి అందుబటులో తీసుకురావడం ముఖ్య ఉద్దేశం అన్నది 2026 నేపథ్యం. సేవలో (ఊపిరితిత్తుల సామర్థం తెలుసుకునే పరీక్ష) మరియు ఆస్తమా తీవ్రతను తెలిపే పరీక్ష ఉచితంగా చేయబడునన్నారు. పరీక్షలు ఉచితంగా చేయు ప్రదేశం భువన విజయం ఆడిటోరియం ఎస్ వి వైద్య కళాశాల కార్యాలయ ప్రాంగణము ఉదయం 09 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు ధూళి, కాలుష్యం, పొగ త్రాగడం, అలర్జీలు వంటి కారణాలు ఆస్తమాను మరింత తీవ్రమయ్యేలా చేస్తాయి. వైద్య నిపుణులు మాట్లాడుతూ, ఆస్తమా పూర్తిగా నియంత్రించగల వ్యాధి అని, వైద్యుల సూచనల మేరకు ఇన్హేలర్లు, మందులను క్రమం తప్పకుండా వాడటం ద్వారా సాధారణ జీవితం గడపవచ్చని తెలిపారు.

## గ్యాస్ బండను గుదిబండ చేశారు...



రేణిగుంట మే 4 ప్రభాతవార్త :

పేదవారికి చిరు వ్యాపారులకు గ్యాస్ బండను కొనడానికి వీలు లేకుండా విపరీతంగా రేటు పెంచి గుదిబండ చేశారని సిపిఎం, సిపిఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం రేణిగుంట పట్టణం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ అదాని అంబానీ కోసం గ్యాస్ సిలిండర్లను రేట్లు పెంచి వినియోగదారులపై కేంద్ర ప్రభుత్వం పేరు భారం మోపిందన్నారు. డొమెస్టిక్ సిలిండర్ ధరను నిరుపేదకు అందుబాటులో లేకుండా 993 రూపాయలు, చిరు వ్యాపారులకు వ్యాపారాలు చేసుకోకుండా కమర్షియల్ సిలిండర్ ధరను ఏకంగా 3073 రూపాయలు పెంచడం అన్యాయమన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికలు పూర్తయి ఫలితాలు రాకముందే గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం హేయమైన చర్యగా అభివర్ణించారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో సిపిఎం పార్టీ ప్రాంతీయ కన్వీనర్ హరినాథ్, సెల్వరాజ్, ఓవి రమణ, రాజశేఖర్, చీరాలయ్య, దస్తగిరి, గురుమూర్తి, ఆనంద్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, సిపిఐ పార్టీ నాయకులు భాను తదితరులు పాల్గొన్నారు..

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన...



***రేణిగుంట మే 4 ప్రభాతవార్త :*** రేణిగుంట తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం తహసిల్దార్ శ్యాం ప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. 7 అర్జీలు రెవిన్యూ, 1 అర్జీ సర్వే, 2 అర్జీలు మండల అభివృద్ధి శాఖకు సంబంధించి సమర్పించారు. అధికారులు అర్జీదారులకు రసీదులు ఇచ్చారు. అర్జీదారులు సమర్పించిన అర్జీలపై సర్వే, విచారణ జరిపి గడువు లోపల సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్వేయర్ కరుణాకర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాథిపతికన విద్యుత్ మరమ్మతు పనులు.



**రేణిగుంట మే 4 ప్రభాతవార్త :** ఆదివారం సాయంత్రం గాలివాన సృష్టించిన బీభత్సానికి రేణిగుంట మండలంలో 29 స్తంభాలు, నాలుగు ట్రాన్స్ఫార్మర్లు నేలకొరిగి దెబ్బతిన్నాయని ఏపీ ఎస్పీడీసీఎల్ రేణిగుంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ రమేష్ బాబు తెలిపారు. రాత్రి వరకు విద్యుత్ సిబ్బంది నిద్రపోకుండా మండలంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని కష్టపడి పనిచేసి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరాను చాలా ప్రాంతాల్లో పునరద్దరించారన్నారు. రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద గాలులకు ఓ ప్రైవేటు ఫ్యాక్టరీకి సంబంధించిన చిమ్ని విద్యుత్ స్తంభాలపై కూలిందని, మండలంలో చాలా చోట్ల చెట్లు పడిపోయి స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు నేలకొరిగాయని తెలిపారు. రేణిగుంట రూరల్ పరిధిలో ట్రాన్స్ఫార్మర్, ఒక స్తంభం, గుత్తి వారి పల్లి, ఎలమండ్యం, పంచాయతీలో ట్రాన్స్ఫార్మర్లు పడిపోయాయన్నారు. అనేక చోట్ల స్తంభాలు దెబ్బతిన్నాయన్నారు. వీటిని అన్నిటిని సరిచేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. పనులన్నీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్ రెడ్డి పర్యవేక్షణలో అర్బన్ ఏ ఈ పుణ్యకోటి, రూరల్ ఎయ్యి మల్లికార్జున విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లు, విద్యుత్ సిబ్బంది కష్టపడి సేవలందిస్తూ త్వరితగతిన విద్యుత్ సరఫరా పునరద్ధరిస్తారని నమ్మకం వ్యక్తం చేశారు..

## విద్యుత్ ప్రమాదాల నివారణపై పోస్టర్లు ఆవిష్కరణ.

**పెద్దపంజాణి మే4 ప్రభాతవార్త:** విద్యుత్ ప్రమాదాల నివారణపై స్థానిక మండలకార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ బాలాజీ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్విచ్‌లను తడిచేతులతో చెప్పులు లేకుండా తాకరాదని,వ్యవసాయ పొలాల్లో తెగిపడిన విద్యుత్ వైర్లను తాకరాదని,పంటపొలాల చుట్టూ వేసినకంచెకు విద్యుత్‌కనెక్షన్ ఇవ్వరాదని,విద్యుత్‌తీగలపై తడిబట్టలు ఆరవేయరాదని తదితర విషయాలను సూచించే పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఏఈ వెంకటరమణ,డిప్యూటి ఎంపీడీఓలు శారదాదేవి,సుదాకర్,ఎంఈఓ గోపాల్ రెడ్డి.ఏపీఓ మురగేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## గణనాధుని దర్శించుకున్న జిల్లా ఎస్పీ ఎమ్మెల్యే మురళి

**కాణిపాకం, మే 4 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ తుషార్ దూడి, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్లు సోమవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ చైర్మన్ వి.మణి నాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు.అలాగే శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం నవగ్రహాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం



ఐరాల, మే 4 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండల జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా దర్బార్ వేదికగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ లోకేశ్వరి, ఎంపీడీవో, జడ్పిటిసి సుచిత్ర, మాజీ జెడ్పిటిసి లత, మండల టిడిపి అధ్యక్షులు హరిబాబు నాయుడు, మాజీ అధ్యక్షులు గిరిధర్ బాబు, పలు వురు ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

***కాణిపాకం మే 4 ప్రభాతవార్త :*** కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి సోమవారం భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెన్నైకి చెందిన పొంగవనం శీను అనే భక్తుడు నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయలను విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని దాత కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సూపరిండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి లకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్రాల సబ్సిడీ పథకంపై రైతులకు విస్తృతంగా అవగాహన

**చిత్తూరు, మే 4 ప్రభాతవార్త:** వ్యవసాయ యంత్రాల సబ్సిడీ పథకంపై జిల్లాలోని రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీ రూపంలో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందించడానికి జిల్లాకు ప్రభుత్వం 2.22 కోట్ల రూపాయలు మంజూరు చేసిందన్నారు. కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్ సమీపంలోని సమావేశ భవనంలో రాష్ట్రంలో వ్యవసాయ యంత్రీకరణకు ఊతం-ఎస్ఎంఎఎం సబ్సిడీ పథకం 2025-26 అమలు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జెసి రాజేంద్రన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం దృష్ట్యా వ్యవసాయ రంగంను ఆధునీకరించడానికి కీలక నిర్ణయం తీసుకుందన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎస్ఎంఎఎం(సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్) పథకం కింద వ్యవసాయ యంత్రాలపై సబ్సిడీ మంజూరు చేయడానికి నూతన మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి మురళీ, ఉద్యానశాఖ అధికారి పి.రామాంజనేయులు, జిల్లా మేనేజర్ శశి చంద్రమౌళిరెడ్డి, సైంటిస్ట్ రామకృష్ణారావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగజాతర నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**చిత్తూరు, మే 4 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో నిర్వహించే గంగజాతర ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టి జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా పక్కా చర్యలు తీసుకోవాలని చిత్తూరు డిఎస్పీ వెంకటనారాయణ స్పష్టం చేశారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో సోమవారం డిఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో గంగజాతర నిర్వహణ కమిటీ సభ్యులు, అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ చిత్తూరు గంగజాతరకు వేలాది భక్తులు హాజరవుతారని, వారు భద్రంగా సురక్షితంగా జాతను ఆస్వాదించాలంటే ప్రతి శాఖ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన మౌళిక సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. జాతర సందర్భంగా చిత్తూరు నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా వుండాలన్నారు. అలాగే జాతరలో మహిళలు, వృద్ధులు, పిల్లలకు సురక్షితమైన వాతావరణం వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, జిడినెల్లూరు ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాస్, జిల్లా ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, ఆర్టీసీ డిపో మేనేజర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్లచే ప్రజాదర్బార్



**కుప్పం, మే 4 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నా యుడు ఆదేశాలతో స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో సోమ వారం ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలనుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి వాటి పరిష్కారం కు తగు చర్యలు తీసు కుంటామన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి సాయం, పింఛను, భూ సమస్యలు తదితరాలపై ప్రజలు వినతిప త్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వవిప్ డాక్టర్ శ్రీకాంత్ ఎంతో సావధానంగా విని సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడ్తామన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే తమ ధ్యేయమన్నారు.

## రామకుప్పంలో వడగళ్ల వర్షం



**రామకుప్పం, మే 4 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రామకుప్పం, పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. వర్షానికి తోడు భారీగా ఈదురు గాలులు సైతం వీచాయి. కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో జీడిగుట్ల వద్ద రోడ్డు పక్కన ఉన్న వృక్షాలు నేల కూలాయి. ఈదురు గాలుల ధాటికి రైతులు సాగు చేస్తున్న పంటలకు నష్టం కొంతమేర వాటిల్లింది.

## నేడు శ్రీ తిరుపతి గంగమ్మ జాతర చాటింపు

కుప్పం, మే 4 ప్రభాతవార్త



కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు సంబంధించి చాటింపు కార్యక్రమంను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు తెలిపారు. ఉదయం కొడిమానుపూజ, పెద్దబావి దగ్గర గంగపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30గంటలకు అమ్మవారికి అభిషేకం, మధ్యాహ్నం 12గంటలకు అంబలిపోయుట, రాత్రి 12గంటలకు అమ్మవారి జాతర చాటింపు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు - డిపిఎం అమృతవల్లి



**కుప్పం, మే 4 ప్రభాతవార్త** ప్రకృతి వ్యవసాయంతో రైతులు మంచి లాభాలు పొందవచ్చని కుప్పం డిపిఎం అమృతవల్లి పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ రంగంవైపు సుమారు 25వేలమందిని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. బయో రీసోర్స్ కేంద్రాల్లో నవధాన్యాల కిట్లు తయారు చేయడం జరుగుతోందన్నారు. తొలకరి వర్షాలకు ముందు 32 రకాల విత్తనాలను, విత్తన గుళికలుగా పొలంలో వేయాలన్నారు. తద్వారా వర్షం పడితే విత్తనాలు మొలకెత్తుతాయన్నారు. ఈ పంటను నలభై రోజుల తర్వాత పశువులకు మేతగా వాడుకునే అవకాశం ఉంటుందన్నారు. మిగతా పంట వేర్లు భూమిలో ఉండడంతో నేల సారవంతంగా ఉండడంతో పాటు పంటకు అవసరమైన పోషక పదార్థాలు లభిస్తాయన్నారు. 32 రకాల విత్తనాలు ఒక కిట్‌గా 15కిలోల మేర 900రూ.లకు రైతు సేవా కేంద్రాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే బయో రీసోర్స్ కేంద్రాల ద్వారా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా రైతులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బాజీబాబు, మార్కెటింగ్ ఎంటి షఫీ, నాలుగు మండలాల ఇన్‌చార్జ్‌లు, ఎఫ్ఎంటిలు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గుండెలు గుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్మానం

తొట్టంబేడు,మే 4 ప్రభాతవార్త



మండలంలోని గుండెలు గుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సత్ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కమిటి, ప్రధానోపాధ్యాయులు సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా గాలి మురళినాయుడు హాజరయ్యారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభో అధిక మార్కులు సాధించిన హరీష్ '547) ధనుష్‌కుమార్ (543), మంజుల (529) ప్రేమచంద్ (509), భువనేశ్వరి (487) మార్కులు సాధించినట్లు వివరించారు. వారిని పాఠశాల తరఫున సత్కరించారు. మురళినాయుడు విద్యార్థులను దుశ్శాలువలతో సత్కరించి రాబోవు రోజుల్లో మంచి ఫలితాలు సాధించి పునాది అయిన పాఠశాల పేరును ఇనుమడింపజేయాలని మురళి నాయుడు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు చెంచయ్య మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి హాజరైన విద్యార్థులు గణితంలో నూటికి నూరు మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా మురళి నాయుడుమాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో మంత్రి నారాలోకేష్ ప్రవేశ ఎపెట్టిన విద్యాసంస్కరణలు సత్ఫలితాలకు ఇదే నిదర్శనం అన్నారు. ఈ ఏడాది కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సవాలుగా మాకెదురేంటి అన్నట్లు ర్యాంకులు సాధించారన్నారు. రాబోవు రోజుల్లో విద్యాశాఖలో ఎన్నో మార్పులు చేర్పులు ఉంటాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి నారాలోకేష్ ఎన్నో ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా గణితం బోధించిన ఉపాధ్యాయులు మునీశ్వర్‌రెడ్డి చొరవ శ్రద్ధను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు చెంచయ్య, మునీశ్వరరెడ్డి, భాస్కరయ్య, శేఖర్‌రెడ్డి, ఢిల్లిబాబు విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు.

## 7న కంచిపీఠం వారిచే స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో ఈ నెల 7న కంచి డీమ్డ్ యూనివర్సిటి సారధ్యంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు మేనేజ్‌మెంట్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శ్రీకాళహస్తి పట్టణ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఓ మంచి అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు. కంచిపీఠం చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిచే నిర్వహించబడుతున్న డీమ్డ్ యూనివర్శిటి సేవలను విస్తృతంచేయటాఇకి నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్మీడియేట్ మార్కులలతో వివిధ డిగ్రీ కోర్సులు,డిగ్రీ పాస్‌అయిన విద్యార్థులు పిజి లో చేరికకు నిర్ణయించినట్లు వివరించారు. ఈ నెల 7న సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు పట్టణంలోని బ్రాహ్మణ సమాజం కమ్యూనిటి హాల్‌లో స్పాట్ అడ్మిషన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆడ్మిషన్లకు యూనివర్సిటికి చెందిన వైస్ చాన్సలర్, డీన్,ప్రోఫేసర్లు హాజరౌతారని వివరించారు. విద్యార్థులకు సంప్రదాయ విద్యతో పాటు క్రమశిక్షణ కల్గిన విద్యను అభ్యసించుటకు అవకాశం ఉంటుందన్నారు. అడ్మిషన్లకు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలనికోరారు. వివరాలకు చరవాణి 8106596773,9885261974లను సంప్రదించాలని కోరారు.

## గొల్లపల్లిలో 53వ అగ్నిగుండ మహోత్సవం

శ్రీకాళహస్తిరూరల్,మే 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిమండలం గొల్లపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కావమ్మ దేవత ఆలయంలో 53వ అగ్నిగుండ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజర య్యారు. అగ్నిగుండ ప్రవేశ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్దలతో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు కదలి వచ్చారు. అంజూరు తారక శ్రీనివాసులు రాగా ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో కావమ్మదేవి ట్రస్టు గౌరవాధ్యక్షులు అక్కుపల్లి వెంకటమహేష్, బాసిరెడ్డి రెడ్డి శేఖర్, ట్రస్టు అధ్యక్షులు ఉడమలపాటి మునిబాబు, కార్యదర్శి ఉడమలపాటి మునిమారయ్య, ట్రస్టు సభ్యులు ఉడమలపాటి మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## బత్తినయ్య స్వామి సమారాధన

శ్రీకాళహస్తిరూరల్,మే 4 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం బత్తినయ్య స్వామి శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు వరంగా మారింది. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలం అబ్బాబట్ల పల్లి గ్రామంలో వెలసిన బత్తినయ్యస్వామి సమారాధన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలను సుధాకర్ అనూషలు సమాధాన కార్యక్రమాలను ఏర్పాటుచేయగా ముఖ్యఅతిథిగా హాజరైన బొజ్జల బృందమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిన్నారులను ఒడిలో చేర్చుకొని ముద్దాడి తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురికి అన్నదానం జరిపారు.

## ఆర్‌డిఓ కార్యాలయంలో ప్రజా వేదిక

శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయంలో సోమవారం ప్రజా వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్‌డిఓ భాను ప్రకాష్ ఠరెడ్డి అర్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మండలం, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల నుంచి వచ్చిన జనం అధికంగా భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన అర్జి దారులకు సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని వివరించారు. జనగణనకు అందరూ సహకరించాలన్నారు. అనేక మంది రైతులు భూ రీసర్వేలో తలెత్తుతున్న సమస్యలను సర్వే నెంబర్లు తారు మారు నూతన పట్టాదారు పట్టా పుస్తకాలు కోసం అర్జిలు సమర్పించారు. జనగణనకు ఎనిమినేటర్లు వచ్చిన వారితో సహకరించాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయిలో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

## గుడిమల్లం ఇఓను సత్కరించిన సిబ్బంది:

ఏర్పేడు,మే 4 ప్రభాతవార్త



ఏర్పేడుమండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో సుమారు 6 సంవత్సరాలు పని చేసి ఉద్యోగ విరమణ చేసి ఉద్యోగ విరమణ చేసిన ఇఓ రామచంద్రారెడ్డిని సోమవారం సత్కారం కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆరుసంవత్సరాలుగా ఆలయ అభివృద్దికి విశేష కృషి చేసిన రామచంద్రారెడ్డి సారధ్యంలో ఎప్పుదు కకుంబాభిషేకం జరిగిందో తెలియదు కానీ ఇఓ హయాంలో కుంబాభిషేకం నిర్వహణకు పట్టుబట్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆలయంలో రామచంద్రారెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బత్తలగిరినాయుడు,అర్చకులు పవన్, వంశీకృష్ణశర్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బత్తలగిరినాయుడుమాట్లాడుతూ ఆలయ అభివృద్దికి తనతో సహకరించారన్నారు. ముఖ్యంగా ఆలయ అభివృద్దికి తీసుకున్న నిర్ణయాలను అమలు చేయటంలో రామచంద్రారెడ్డి సత్కారం ఎంత చెప్పినా తక్కువే అన్నారు. ఆలయాన్ని ప్రపంచ నలుదిశలా ఖ్యాతిని ప్రచారం చేయటానికి ఎంతో సహకరించారన్నారు. మహోన్నత కుంబాభిషేకం జరిపటంలో ఎంతో సహకరించారన్నారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు.

## సూరికాపురం సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



**విజయపురం, మే 5 ప్రభాతవార్త:** మండలంలోని సూరికాపురం సచివాలయాన్ని సోమవారం విజయపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరిప్రసాద్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని రికార్డులను పరిశీలించారు. సచివాల యసిబ్బందికి తగు సూచనలు సలహాలను అందించారు. ఎంపీడీవోతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## కావమ్మ ఆలయ వార్షికోత్సవం:

శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణం బహాదూరుపేట కుందేటి వారి వీధిలో నూతనంగా నిర్మించిన కావమ్మసూరయ్య ఆలయం ఏడాది సందర్భంగా వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయనకు కమిటి సభ్యులు ఘనస్వాగతం పలికారు. మేళ తాళాలు మంగళవాయిద్యాలతో భక్తి శ్రద్దలతో సామి అమ్మవార్ల ఉత్సవర్లను ప్రతిష్టించి అగ్నిగుండం నిర్వహించారు. మాజీ చైర్మెన్‌ను కమిటి సభ్యులు దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. కాగా మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి తన సహచరులతో అమ్మవారి ఉత్సవంలో పాల్గొన్నారు. వారికి కమిటి ఆలయ ధర్మకర్త నిర్మాణ కర్త ఆర్‌బాలకృష్ణస్వామి, సురేష్, పాలమంగళం రవి, శివ,పల్లంగోపి,, ఉదయగిరి తేజు, మున్నా రాయల్,గుణ, సాయి,.జీవ ఆరుణ్ హాజరయ్యారు. వారికి ఆలయ కమిటి సారధ్యంలో సత్కరించారు.

## పాఠశాల విద్యే భవిష్యత్తుకు పునాది:పవార్

శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త



మనిషికి విద్యార్థి దశ, పాఠశాల విద్యే భవిష్యత్తుకు పునాది అని దస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ జనార్ధన్‌రావు పవార్ అన్నారు. సోమవారం పాఠశాల అవరణలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రావు పవార్ మాట్లాడుతూ మనిషికి విద్యార్థి దశ కీలమమైనదన్నారు. ఈ దశలో విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయులు ఇంటిలో తల్లిదండ్రులు ఎంతో జాగ్రత్తగా తీర్చి దిద్దాలని సూచించారు. పాఠశాలలో ఉన్నంత సేపు ఉపాధ్యాకులు కంటికి రెప్పలా కాపాడుతారని అలాగే ఇంటిలో తల్లిదండ్రులు బిడ్డల ప్రవర్తనను గుర్తించాలన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని కోరారు. శ్రీకాళహస్తిలో ఉత్తమ విద్యతో పాటు క్రమశిక్షణ,సంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఈ నేపధ్యంలో నేడు పట్టణంలో తమ పాఠశాల ముందంజలో ఉందన్నారు. ఈ ఏడాది పరీక్షా ఫలితాల్లో కకూడా ద స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు, ఎం.రితిక(594),ఎ.భవిత (589), ఎం.ఆగస్త్య సాయి(588),కె.చరణ్ (581) మార్కులు సాధించారన్నారు. వీరిని తీర్చి దిద్దిన ఉపాధ్యాయుల్ని వారి కన్న తల్లిదండ్రులనుసత్కరించటం తమ బాధ్యతగా సత్కరించామన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.విశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కాశీ ఆలయ ఇఓ

శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వెలసిన స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని సోమవారం శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శంభు శరణ్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకు న్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులచే స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనానికి ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా ఇఓకు ఆలయ చరిత్రను, ఆలయాభివృద్ది ఇక్కడ అమలు చేస్తున్న సేవలను,సామాజిక సేవా పథకాలను అన్నదానం, రాహుకేతుదోష నివారణ పూజల గురించి ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టే సాయి ప్రసాద్ వివరించారు. ఆలయ ఆదాయ వివరాలను తెలిపారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. చైర్మెన్ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి, ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకుడు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## నాగలాపురం మండల సమస్యలను పరిష్కరించాలి - ఎంపీడీవో



**నాగలాపురం, మే 4 ప్రభాతవార్త:** నాగలాపురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు టీజేబీ ప్రణీత్‌రెడ్డి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఎంపీడీవో ప్రియాంకను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని 19 పంచాయతీల్లో ఉన్న తాగునీటి సమస్యలు, రహదారి దుస్థితి, మురుగునీటి పారుదల సమస్యలను సమగ్రంగా వివరించి వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ఎంపీడీవో సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత సమస్యలను త్వరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం మండలం టీడీపీ యువ నాయకుడు నరేంద్రరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో క్యారియర్ పరిశ్రమకు నారా లోకేష్ శంకుస్థాపన



**సత్యవేడు, మే 4 ప్రభాతవార్త:** సత్యవేడు మండలపరిధిలోని శ్రీసిటీలో మే 6వ తేదీ(బుధవారం) క్యారియర్ పరిశ్రమకు శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొనున్నట్లు అధికారికంగా సమాచారం. కొన్ని నెలల క్రితం శ్రీసిటీలో ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజ చేయడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇదే తరహాలో ఆంధ్ర రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధిని కల్పించడంలో ప్రభుత్వం ముందు ఉంటుందని తెలుస్తుంది. శ్రీసిటీ ఒక గొప్ప పేరు ప్రఖ్యాతిని సంపాదించుకున్నట్లు తద్వారా ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు: బడి పిలుస్తోంది

తొట్టంబేడు,మే 4 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలో సోమవారం బడి పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రచార వాహనాన్ని శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు విద్యాశాఖాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చెంచయ్య నాయుడు మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల తీరు తెన్నులను మార్చే దిశగా విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చర్యలు తీసుకుంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నారు. ప్రతి ఒక్క నిరుపేదలకు ఉన్నత విద్యను అందించుటకు మంత్రి చొరవ తీసుకోవటం అభినందనీయం అన్నారు. విద్యాశాఖ నుంచి ముఖ్యఅతిథిగా సిఎం ఓ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అందరూ పదోతరగతి నుంచి ర్యాంకులు సాధించి ప్రభుత్వ పాఠశాలల తీరును ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరటానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించుటకు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాశాఖాధికారి ఎం.భారతి మండల అధికారులు పాల్గొన్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో కూటమి పార్టీ గెలుపుపై హర్షం

నింద్ర,మే 4 ప్రభాతవార్త :



ఐదు రాష్ట్రాల ఎన్నికలలో సోమవారం జరిగిన కౌంటింగ్‌లో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలలో యన్‌డిఏ కూటమి గెలుపొందడంతో కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేసారు. మండలంలోని మేళంబాకం గ్రామంలో కూటమి పార్టీ ఎన్నికల గెలుపుపై టపాసు పేల్చి,మిఠాయిలు పంచుకు న్నారు. ఈసందర్భంగా బిజెపి సినియర్ నాయకులు డి.చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ దేశప్రధానమంత్రి నరేంద్రమోడి నాయకత్వంలో దేశం శాంతయుతమైన వాతావరణంలో దేశం అబివృద్ది సాధిస్తావుందని తెలిపారు. రాబోవు రోజులలో మరిన్నో విజయాలు సాధిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు జయచంద్రరాజు, జనార్దన్‌రాజు, నాగభూషణరాజు, భాస్కర్‌రాజు, క్రిష్ణమ రాజు, వెంకటపతిరాజు, అపరంజి, వెంకటేశులుతదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే "పిజిఆర్ఎస్"

### తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి

చంద్రగిరి, మే 4 ప్రభాతవార్త:



మండల పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించినట్లు తహశీల్దార్ దుద్దెల అమరేశ్వరి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలసి ఆమె పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలతో 20 మంది తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను స్థానికంగా మండల రెవెన్యూ కార్యాలయంలో పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. ప్రతి చిన్న సమస్యకు జిల్లా కేంద్రానికి వెళ్ళడం ద్వారా ఇబ్బంది పడవద్దని సూచించారు. మీ సమస్య ఇక్కడ పరిష్కారానికి నోచుకోని పక్షంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే పిజిఆర్ఎస్‌కు వెళ్ళవచ్చని అన్నారు. అర్జీదారులు తమ నివాస స్థలాలు, నివాసాలను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అనుభవ ధృవపత్రాలను కోరినట్లు వివరించారు. అదేవిధంగా ఇళ్ళ స్థలాలు, విద్యుత్ సర్వీస్, ఆక్రమణలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేసినట్లు తెలిపారు. ప్రతి సమస్యను తప్పక పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ఏఓ విజయభాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ దివాకర్, విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల దినోత్సవం

పుత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమ వారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.సి.వెంకటేశ్వరులు పేర్కొన్నారు. పుత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలసి పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మండల స్థాయిలో ఏమున్నా సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పది వినతులు వచ్చాయని వాటిలో పట్టాదారు పాస్‌పుస్తకాలు సర్వే రేషన్ కార్డుల కోసం విన్నవించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు శ్రీదేవి, కోదండయ్య, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల బస్సులు నిబంధనలు పాటించాలి: ఆర్‌టిఓ

శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో రహదారి భద్రత దృష్ట్యా పాఠశాలల బస్సు లను నిబంధనల మేరకు మేనేజ్‌మెంట్లు ఏర్పాట్లు చేయాలని శ్రీకాళహస్తి రవాణా శాఖాధికారి దామోదర్‌నాయుడు సోమ వారం తెలిపారు. ఈ మేరకు సోమవారం పలు పాఠశాలల బస్సులను తనిఖీ చేసారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే బస్సుల కండిషన్‌లను మేనేజ్‌మెంట్లు సిద్దం చేయా లన్నారు. పాఠశాలల బస్సులన్ని సకాలంలోనే మరమ్మత్తులు చేయించి పిట్‌నెస్ సర్టిఫికేట్లు పొందాలని దామోదర్‌నాయుడు సూచించారు. ఇప్పటికే ఫిట్‌నెస్ కల్గి ఉన్న వాహనాలను తనిఖీ చేసారు. కొత్త బస్సులకు పిట్‌నెస్ సర్టిఫికేట్ రెండు సంవత్సరాల వరకు జారి చేయటం జరుగుతుందన్నారు. ఈమధ్య కాలంలో ఏవైనా రిపేర్లు ఉన్నప్పుడు ఖచ్చితంగా నిబంధనల ప్రకారం రిపేర్లు చేయించుకొని వాహనాన్ని వచ్చే విద్యా సంవత్సరానికి సిద్దం చేసుకోవాలని పాఠశాల మేనేజ్‌మెంట్లను సూచించారు. సోమవారం ఆర్‌టిఓ పది బస్సులను తనిఖీ చేసారు. ఇందులో మూడు వాహనాలు తమ నిబంధనలకు అనుగుణంగా లేనట్లు గుర్తించినట్లు వారికి ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని సిద్దం చేసుకోవాలని ఆయన సూచించారు.


కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Together we can
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) తిరుచానూరు శాఖ, తిరుపతి తిరుపతి జిల్లా

**అమ్మకం ప్రకటన**

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన ఋణగ్రహీత ఆర్.కార్తీక్ & ఆర్ కవి అరసు మరియు గ్యారంటారు ఎస్.లోకనాథరెడ్డి నెన్నూరు గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా అధీకృత అధికారి, తిరుచానూరు శాఖ కెనరాబ్యాంక్ వారు తేది: 06.01.2026 జారీ చేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన బకాయి వున్న మొత్తం రూ.17,81,166.55/- పై లను+వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్దతిపై 06.6.2026 న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.

స్థిరాస్తి వివరములు:- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, రేణిగుంట సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, నెం.11, తిరుచానూరు గ్రూప్- తిరుచానూరు గ్రామ పంచాయతీ వార్డునెం.11 యోగిమల్లవరం రెసిడెన్షియల్ ఏరియా, యోగిమల్లవరం గ్రామ లెక్కదాఖలా సర్వే నెం.8/1 లోని తుడా డి.టిసి. ఎల్.ఆర్.ఎస్.నెం.4149/2010, తేది: 11.03.2011గా అప్రూవల్ పొందిన ప్లాటు నెం.10 పార్ట్ స్థలంలోని ఆర్‌సిసి డూప్లెక్స్ ఇల్లు, తిరుచానూరు గ్రామ పంచాయతీ వారిచే బి.ఎ.నెం.11/2011-2012, తేది: 29.04.2011 గా రెగ్యులరైజ్ అయిన స్థలంలోని డి.నెం.11-1/5-8 ఆర్‌సిసి ఇల్లు. హద్దులు: తూర్పు: 9అ. వెడల్పు జాయింట్‌రోడ్డు, పడమర: ప్లాటు నెం.11,12 & 13 ఉత్తరం: 33అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.10 గల ఇల్లు, ఈ హద్దుల మధ్య తూర్పునుండి పడమర: 37అ. లేదా 11.285 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 35అ. లేదా 10.675 మీ. వెరశి 1295అ. లేదా 143.88 చ.గ. భూమి మరియు 2350 చ.అ. ఆర్.సి.సి. డూప్లెక్స్ ఇంటి నిర్మాణం

| | |
|---|---|
| రిజర్వు ధర : రూ.74,91,000.00 | ధరావత్తు : రూ.7,49,100.00 |

ధరావతు సమర్పణకు ఆఖరు తేది & సమయం : 04.06.2026 సా.5.00గం॥లకు లేదా ఆలోపు. అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ www.canarabank.com లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. లేదా అధీకృత అధికారి, కెనరాబ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి, ఫోన్: 0877-2500130, 7901092637 వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

ప్రదేశం:తిరుపతి, తేది:02.05.2026 అధీకృత అధికారి, కెనరాబ్యాంక్



కెనరా బ్యాంక్ केनरा बैंक Canara Bank Together we can
(భారత ప్రభుత్వ రంగ సంస్థ) తిరుపతి ప్రధాన శాఖ, తిరుపతి తిరుపతి జిల్లా

**అమ్మకం ప్రకటన**

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు) దిగువ తెలిపిన ఋణగ్రహీత శ్రీనాయుని లక్ష్మయ్య & శ్రీమతి నాయుని విజయలక్ష్మి గారికి చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటారుకు తనఖా/ఛార్జిలో వుంచి నిర్మితంగా అధీకృత అధికారి, తిరుపతి ప్రధాన శాఖ కెనరాబ్యాంక్ వారు తేది: 09.01.2026 జారీ చేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన బకాయి వున్న మొత్తం రూ.15,75,996.51పై లను+వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు స్వాధీనం చేసుకుని "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా వున్నదో అలానే" మరియు "అక్కడ ఏమి వున్నదో అదే అనే పద్దతిపై 06.6.2026 న వేలం వేయుటకు నిర్ణయించినారు. రిజర్వుధర, ధరావత్తు, స్థిరాస్తుల యొక్క పూర్తి వివరాలు దిగువ తెలుపడమైనది.

స్థిరాస్తి వివరములు:- తిరుపతి జిల్లా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, నెం.29 తిరుపతి గ్రామలెక్కదాఖలా, 20వ వార్డు, సర్వేనెం.696/1 సబ్ డివిజన్ అనంతరం సర్వేనెం.696/1బి/2, 696/2, 697/1 లోని శివజ్యోతినగర్ రెసిడెన్షియల్ ఏరియాలోని స్థలంలో నిర్మించిన ప్రకృతి హరిహర హైట్స్ అపార్ట్‌మెంట్ యొక్క పూర్తి విస్తీర్ణం 3498.29 చ.గ. ఇందులోని ఎ-బ్లాక్ 2వ అంతస్తు, డి.నెం.20-3-2/ఎస్202, అసెస్‌మెంట్ నెం.1012071635గల నివాసయోగ్యమైన ఫ్లాట్ నెం.202 యొక్క బిల్టప్ ఏరియా 1595 చ.అ. (అవిభాజ్యవాటా విస్తీర్ణం 71.36 చ.గ.) ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు: కామన్ కారిడార్ & ఓపెన్ టుస్కై, పడమర: ఓపెన్ టుస్కై, ఉత్తరం: ఓపెన్ టుస్కై, దక్షిణం: ఓపెన్ టుస్కై, & ఫ్లాట్ నెం.203,

| | |
|---|---|
| రిజర్వు ధర : రూ.71,05,000.00 | ధరావత్తు : రూ.7,10,500.00 |

ధరావతు సమర్పణకు ఆఖరు తేది & సమయం : 04.06.2026 సా.5.00గం॥లకు లేదా ఆలోపు. అమ్మకానికి సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు కెనరాబ్యాంకు వారి వెబ్‌సైట్ www.canarabank.com లోని పొందుపరిచిన "ఈ-ఆక్షన్" అను లింక్‌ను పరిశీలించగలరు. లేదా అధీకృత అధికారి, కెనరాబ్యాంక్, ప్రాంతీయ కార్యాలయం, తిరుపతి, ఫోన్: 0877-2500130, 7901092637 వారిని కార్యాలయ పనివేళలో సంప్రదించగలరు.

ప్రదేశం:తిరుపతి, తేది:02.05.2026 అధీకృత అధికారి, కెనరాబ్యాంక్

# ప్రభుత్వ భూములను కబ్జాకు యత్నం

## - కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పరిరక్షణ కమిటీ సభ్యులు



వెంకటగిరి, మే 4 ప్రభాతవార్త: పట్టణ నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలకు తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేసేందుకు ల్యాండ్ మాఫియా ప్రయత్నిస్తోందని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ వారు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు ఫిర్యాదు చేశారు. వీరిని అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఇప్పటికే స్థానిక తహసిల్దార్‌కి, శ్రీకాళహస్తి ఆర్డీఓకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఫలితం లేకపోవడంతో పట్టణంలోని రాజకీయపక్షాలు, పౌర సేవా సంస్థలు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీగా ఏర్పడి ఆందోళనను ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఇప్పటికే త్రిభువని సెంటర్లో ఉన్న 45 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని చేజిక్కించుకున్నారన్నారు. తాజాగా తాలూకా సమితి కోసం 1965లో సేకరించిన ఎ 661 సెంట్ల భూమిని కాజేయడానికి సిద్ధపడ్డారు. అప్పటి రెవిన్యూ అధికారులు ప్రభుత్వం సేకరించిన తర్వాత ఫేరడంగుల్లో ఇంప్లిమెంట్ చేయకపోవడం వల్ల అవే పేర్లు ఇప్పటికీ కొనసాగుతు న్నాయన్నారు. వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్ సెంటర్లో ఉన్న పెరియవరం రెవిన్యూ గ్రామం సర్వేనెంబర్ 109లో 15 కోట్ల రూపాయల విలువ చేసే 230 ఎకరం భూమిని కూడా తప్పుడు రికార్డు లతో ఆక్రమించేందుకు చూస్తున్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ సర్వేనెంబర్ 1613 లోని ఎ 529 సెంట్లు స్థలాన్ని కూడా తప్పుడు రికార్డులతో స్వాధీన పరుచుకునే ప్రయత్న లో ఉన్నారు. కైవల్యానది బఫర్‌జోన్ ప్రాంతం కూడా నదివరకూ ఆక్రమి ంచి పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. సర్వేనెంబర్ 215 లోని 36 ఎకరాల విస్తీర్ణం కలిగిన అమ్మవారిపేట చెరువు చుట్టూ లేఔట్లు రావడంతో చెరువు లోతట్టు భూమిని కూడా ఆక్రమిస్తున్న ందున, చుట్టూ ట్యాంక్ బండ్ నిర్మించి చెట్లు నాటాలని డిమాండ్ చేస్తున్నాం. విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.కె. ప్రసాద్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, వైసీపీ నాయకులు చిట్టేటి హరికృష్ణ, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి అల్లం రాజా, సిపిఐ నాయకులు ఎస్.నరసింహులు, రైతు కూలీ సంఘం నాయకులు గంగలపూడి కృష్ణారెడ్డి, వి.వి.రమణయ్య పాల్గొన్నారు.

## 30 మంది ముస్లిం చిన్నారులకు ఒడుగులు



వాకాడు, మే 4 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులోని జామియా మసీద్ ఆధ్వర్యంలో మసీద్ ముత్తవల్లి హాజీ ఇదాయితుల్లా, ఎస్.కె రహమతుల్లా, షేక్ మీరా హుస్సేన్, షేక్ అమీర్ ఆధ్వర్యంలో ఒడుగులు (ఖత్న) కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన 30 మంది ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగులు చేయగా పిల్లలకు ఉచితంగా మెడి కల్ కిట్లను పౌష్టికాహారాన్ని పొట్లాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ్‌శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లిం నాయకులు ఐక్యమతమేగా ఉంటే సంప్రదాయాలుతో కూడిన ఆరోగ్యకరమైన ఒడుగులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొండారెడ్డి నందగోపాల్ రెడ్డి, రామలింగారెడ్డి, తిరుపతి జిల్లా టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, మాజీ సర్పంచ్ భార్గవ్, అన్నమేటి చంద్రయ్య షేక్ మున్నా షేక్ గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్ష బీమా యోజన చెక్కు పంపిణీ



దొరవారిసత్రం, మే 4 ప్రభాతవార్త: మండలం నెలబల్లి గ్రామంలో జి. శ్రీనివాసులు రోడ్డు యాక్సి డెంట్ ద్వారా మరణించడం జరిగింది. ఈయన గురించి బ్యాంక్‌లో విచారించగా ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన (పిఎంఎస్‌బివై) యాక్టివ్‌లో ఉంది. బ్రాంచ్ మేనేజర్ పవన్ పిఎమ్ ఎస్‌బివై ద్వారా రూ.2 లక్షలు రూపాయలు అమౌంట్ సెటిల్మెంట్ అయ్యింది. పిఎమ్ఎస్ బివై ద్వారా రూ.2 లక్షలు రూపాయలు చెక్కును ఈయన భార్య క్రిష్ణమ్మకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొరవారిసత్రం కెనరా బ్యాంక్ మేనేజర్ పవన్, అసిస్టెంట్ మేనేజర్ రవి తేజ, దొరవారిసత్రం వెలుగు ఏపిఎం మునిరాజయ్య, సూళ్లూరుపేట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ ముని చంద్ర, పరమానందం, వివోఏ కవిత పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి:ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, మే 4 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపట్ల ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు.సోమవారంమార్నింగ్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఇసుక మిట్ట ప్రాంతంలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు రోడ్లు, మంచినీటి వసతి మౌలిక సదుపాయాల విషయంలో ప్రజలు ఎమ్మెల్యేకు సమస్యలను పరిష్కరించాలని వినతి చేశారు. ఈ విషయమై ఎన్నో పర్యాయములు అధికారులకు వినతి పత్రాలు అందజేసిన తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆమెకు తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఆకుతో రమేష్, ఎఫ్ ఎస్‌సిఎస్ చైర్మన్ ఎజి కిషోర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఇవి సురేష్, కె శ్రీధర్, ఎల్ వి.కొండయ్య, దంతాల రవి, మేడ అమర జ్యోతి, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు సన్మానం



సూళ్లూరుపేట, మే 4 ప్రభాతవార్త: విధి నిర్వహణలో కాకుండా సేవా కార్యక్రమాలలో ముందుండి సేవలందిస్తున్న స్థానిక సీఐ ఎం మురళీకృష్ణను రాష్ట్ర మాల మహానాడు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవుల దాస్ సోమవారం ఆయన కార్యాలయంలో కలసి ఘనంగా సన్మానించారు. వేసవి సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు వితరణగా అందజేయడం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని దాస్ తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాల్లో సిఐ మురళి కృష్ణకు చేదోడు వాదోడుగా ఉన్న ఎస్సై అజయ్ కుమార్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.

## మాజీ కౌన్సిలర్ కరీంబాయి వరలక్ష్మికి చివరి వీడ్కోలు

నాయుడుపేట, మే 4 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ నాయకులు కరీంబాయి చెంచయ్య సతీమణి, నాయుడుపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కరీంబాయి వరలక్ష్మికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఘన నివాళులర్పించారు. గత కొంత కాలంగా కరీంబాయి వరలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారు జామున కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం. సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యురాలు డాక్టర్ నల్గొండ విజయ శ్రీ, స్థానిక టిడిపి నాయకులతో కలిసి పట్టణంలోని కరీంభాయి చెంచయ్య నివాసానికి చేరుకుని కరీంభాయ్ వరలక్ష్మి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ యొక్క కార్యక్రమానికి పలువురు టిడిపి నాయకులు విచ్చేసి కరీం భాయ్ చెంచయ్య కుటుంబాన్ని ఓదార్చారు.

## అమ్మ పోలేరమ్మ నీ జాతర ఎన్నడైనా ఇలా జరిగిందమ్మా!

### - అమ్మా నీ దర్శనం ఉందా లేదా అంటున్న పేట ప్రజలు



నాయుడుపేట, మే 4 ప్రభాతవార్త : అమ్మలు కన్నా అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ శ్రీ పోలేరమ్మ జాతర మహోత్సవానికి ఇంత వరకు జరగని ఏర్పాట్లు అనగా సోమవారం మధ్యాహ్నం వరకు ఎటువంటి ఏర్పాట్లు జరగలేదని నాయుడుపేట, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆగ్రహానికి గురి అవుతున్నారు. ఈ సందర్భంగా శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానాబాల సుబ్బారావు ప్రతి విషయంలోనూ వెనకడుగు వేయడంతో జాతర జరుగుతుందా లేదా అని పట్టణ ప్రజలు ఆశ్చర్యానికి గురై నాన్న రకాలుగా గుసగుసలాడు తున్నారు. జాతరకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యేనా లేదా అంటూ పలువురు పట్టణ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. 5వ తేది మంగళవారం ఉదయం అమ్మవారి నిలుపు కార్యక్రమం ఉండగా ఇంతవరకు ఏర్పాట్లు చేయకపోవడం ఏందీ అంటూ గుడి దగ్గరకు వచ్చిన పలువురు భక్తులు ఈ విషయాన్ని ఖండించారు. ఈ విషయంపై సూళ్లూరుపేట నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయ్ శ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం ఈ విషయంపై తక్షణం చర్యలు చేపట్టి రేపటి కల్లా అన్ని ఏర్పాట్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

## కుంభాభిషేక మహోత్సవం

పెళ్లకూరు, మే 4 ప్రభాతవార్త: తాల్వాయిపాడు గ్రామం నందు నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మరియు కుంబాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్న ఈ మహోత్సవ వేడుకలు ఈ నెల 6 తేదీన శ్రీమహాగణపతి పూజతో ప్రారంభమై 8 తేదీ శుక్రవారం సాయంకాలం స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం, అనంతరం గ్రామోత్సవంతో ముగియనుంది.

# బెంగాల్ ఫలితాలు... హిందూత్వ వాదులకు శుభపరిణామం

## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్ / శ్రీకాళహస్తిలో విజయోత్సవ ర్యాలీ



శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త: భారత దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బెంగాల్ ఫలితాలు, దుష్టశక్తి మమతా బెనర్జి పతనం హిందూత్వ వాదులకు శుభపరిణామనం అని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పిఎన్ మాదవ్ అన్నారు. సోమవారం పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ఏర్పాటు చేసిన సంబరాలకు రాష్ట్ర అధ్యక్షుడు పిఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా పట్టణంలో సంబరాల భారీ ర్యాలి నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాదవ్ మాట్లాడుతూపశ్చిమ బెంగాల్, అస్సాంలో బిజెపి ఘనవిజయం సాధించిందన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు సంపూర్ణ భారతావని పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని వివరించారు. పాండిచ్చేరిలో ఘన విజయం సాధిం చామని కేరళలో మూడు సీట్లుగెలవటం తమిళనాడులోని డిఎంకే ప్రభుత్వం స్థానంలో విజయపార్టీ ఘనవిజయం సాధించటం గమనిస్తే రానున్న రోజుల్లో బిజెపి దేశమంతా సంపూర్ణంగా కమలం వికసిస్తుందన్నారు. ఉత్తరాది ఫలితాలు భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో కమల వికాసానికి సూచికలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాల పర్యవేక్షణలో జరిగే ఏ ఎన్నికల్లో అయినా ఎక్కడైనా బిజెపి విజయదుందుభి మోగిస్తుందని మాధవ్ అభిప్రాయపడ్డారు.

**విజయోత్సవ ర్యాలీ:**

ఐదు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బిజెపి ఘన విజయం సాధించటంతో శ్రీకాళహస్తిలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సంబరాలను ఏర్పాటు చేసారు.ఈ సంబరాలు భారీ ర్యాలిలో రాష్ట్ర అధ్యక్షుడు పివి మాదవ్ హాజరయ్యారు. ఈ సందర్బంగా బేరి వారి మండపం వద్ద విజయోత్సవ ర్యాలి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా భారీ ఎత్తున బాణ సంచాను కాల్చారు. కాషాయ జెండాలతో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాన్ని ముస్తాబు చేసారు. వివిఎంసి సర్కిల్ నుంచి జయరామారావువీధి, బజారువీధిలో పెద్ద ఫ్లెక్సీలు వెలిసాయి.ఈ సందర్బంగా మేళ తాళాలు మంగళ వాయిద్యాలు, నృత్యాలతో సంబరంగా మారింది.ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు సామంచి శ్రీనివాసులు, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, డాక్టర్ చంద్రప్ప, కండ్రిగ ఉమ, తదితరులతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

## బిజెపి గెలుపుతో...తిరుపతిలో బిజెపి సంబరాలు



తిరుపతి,మే 4 ప్రభాతవార్త: సోమవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ విజయ కేతనం ఎగురవేయడంతో తిరు పతిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబ రాలు నిర్వహించారు. నగరంలోని శ్రీదేవి కాంప్లెక్స్ ముందు బీజేపీ నాయకులు చంద్రారెడ్డి, గుండాల గోపినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు టపా కాయలు కాల్చి, ఒకరికి ఒకరు స్వీట్లు పంచిపెట్టు కున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు విశ్వాసం ఉంచుతున్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు ప్రజలు బీజేపీ విధానాలకు ఇచ్చిన మద్దతుకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు బి చంద్ర రెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు గుండాల గోపీనాథ్, బిజెపి జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎస్ మస్తాన్, బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, బిజెపి సెంట్రల్ మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు జయంత్ కుమార్, సుబ్బన్న, పురోహితుడు సురేష్ స్వామి, హేమంత్ రాయల్,డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం, లక్షి ్మ, పద్మావతి రంగస్థలి కార్యదర్శి కేఎన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారమే ధ్యేయం

### -ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



తిరుపతి,మే 4 ప్రభాతవార్త: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలి పారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 26మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. ఎస్.టి.వి.నగర్ తదితర ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయాలని, యూడీఎస్, రోడ్లు మరమ్మతులు చేయాలని, రవీంద్ర నగర్ నందు ఆగిపోయిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని, పిఎస్ 4 హోటల్ వెనుక జరుగుతున్న అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## ఇదో మరచిపోలేని రోజు -తిరుమలలో నటి త్రిష



తిరుమల,మే 4ప్రభాతవార్తప్రతినిధి: తన జీవితంలో ఈ రోజు ఎంతో ప్రత్యేకమైన, మరచిపోలేని రోజు అని, తమిళనాడులో టివికె పార్టీ గెలిచి విజయ్ విజయం సాధిస్తాడని సినీనటి త్రిష ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పుట్టినరోజు సందర్భంగా సోమవారం వేకువ జామున ఆమె తన అనుచరులతో కలసి సుప్రభాతసేవలో దర్శించుకున్నారు.

## ప్రశాంతంగా లాసెట్

యూనివర్సిటీ(తిరుపతి),మే 4ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏపీ లాసెట్ పీజీఎల్‌సెట్ - 2026 పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. ఏపీ లాసెట్ పీజీఎల్‌సెట్ - 2026 పరీక్షలు 2026 మే 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలలోని 100 కేంద్రాలలో రెండు సెషన్లలో ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. ఈ రోజు తిరుపతి పరీక్షా కేంద్రాన్ని లాసెట్ ఛైర్పర్సన్ మరియు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం , రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష మరియు లాసెట్ కన్వీనర్ ఆచార్య టి. సీత కుమారి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణను సమీక్షి ంచారు . ఈ సందర్భంగా లాసెట్ కన్వీనర్ మాట్లాడుతూ, 3 సంవత్సరాల కోర్సు లో 78 శాతం, 5 ఏళ్ళ కోర్సులో 83 శాతం మరియు పరీక్షకు ఏ విధమైనటువంటి ఆటంకం లేకుండా విజయవంతం గా ముగిసిందని తెలియచేసారు.

## శివయ్య సేవలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు



శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త: రాష్ట్రబిజెపి అధ్యక్షుడు పివి మాధవ్ సోమవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఆయనకు రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో బిజెపి కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్బంగా బిజెపి జెండాలతో రెప రెపలాడించారు.దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్,ధర్మకర్తల మండలి సభ్యురాలు వైశాలి, శైలజలు వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయనకు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును కోలా ఆనంద్, మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి బిజెపి నాయకులు ఆమంచి శ్రీనివాసులు, లోకేష్‌యాదవ్, ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, ఎపిఆర్ఓ రవిలు స్థానిక బిజెపి నాయకులతో కళ కళ లాడింది.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తాం : తహసిల్దార్



వెంకటగిరి, మే 4 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని తహసిల్దార్ పి. శిరీష తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, తహసిల్దార్లు ప్రజా సమస్యల పరిష్కార దినం నిర్వహించారు. వెంకటగిరి ఎమ్మార్వో పిజిఆర్ఎస్ డే సందర్భంగా పారవోలు గ్రామంలో 300 ఎకరాలు భూమి ఉందని దీన్ని కొందరు ధనికులు ఆక్రమిస్తున్నట్లు తహసిల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. విఆర్ఓను పంపి భూ సమస్యపై విచారణ జరిపిస్తామని తహసిల్దార్ గ్రామస్థులకు తెలిపారు. గ్రామంలో దారి వివాదం ఉందని పరిష్కరించాలని, కందనాలపాడు గ్రామంలో రోడ్డు వేయించాలని ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డికి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపివో శంషాద్ బేగం, వ్యవసాయ శాఖ ఏడిఏ అనసూయ, ఏవో శిరీష, నీటిపారుదల శాఖ ఏఈలు భూపతి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత ఎస్సై



బాలాయపల్లి, మే 4 ప్రభాతవార్త: శక్తి యాప్ ద్వారా మహిళలకు రక్షణ ఉంటుందని ఎస్ఐ కె.గోపి తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి పిలుపునిచ్చారు. బాలాయపల్లి సంఘమిత్ర కార్యాలయంలో మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు స్మార్ట్ ఫోన్‌లోని శక్తి యాప్ ఏ విధంగా రక్షణ కవచంలా పనిచేస్తుందో డెమో ద్వారా వివరించారు. ఈవ్ టీజింగ్, సైబర్ వేధింపులు ఎదురైనప్పుడు మౌనంగా ఉండకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.సిగ్నల్స్‌ను చూసి రోడ్డు దాటాలని, వాహనం నడిపేటపుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, సైబర్ క్రైం నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏటీఎం, బ్యాంకు ఖాతాల పిన్ నెంబర్లు చెప్పవద్దని సూచించారు.

## సంబరాలు నిర్వహించిన బిజెపి నాయకులు



వెంకటగిరి, మే 4 ప్రభాతవార్త: పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు పట్టణంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబ రాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలనకు ఎన్నికల ఫలితాలు నిదర్శ నం అని ఆ పార్టీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ టిటి మనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రావణ్ కుమార్, రవికుమార్, మల్లికార్జున, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా పల్లకి సేవ



శ్రీకాళహస్తిరూరల్,మే 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి పల్లకి సేవ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఏడాది ఉత్సవాలకు కొత్తగా ఇఓగా బాధ్యతలు చేపట్టిన బికె వెంకటేశులు ప్రత్యేక శ్రద్ద చూపారు. ఆలయాధికారులను ఉత్సవాల్లో ప్రత్యేకత ఉండాలని సూచించారు. దాంతో చిన్న ఆలయాల పర్యవేక్షకులు లక్ష్మయ్య,ఎఇఒ హేమామాలిని ఇక్కడ ఉత్సవాల్లో ప్రత్యేక అలంకారానికి అవకాశం కల్పించారు. సోమవారం ఉదయం తిరువాచ్చి వాహనంలో ఊరేగించిన స్వామి అమ్మవార్లను రాత్రి కన్నుల పండువగా పల్లకి సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయానికి చెందిన లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్, దామోదరం, ఉభయదారులు కందాటి మునిరెడ్డి కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు,ఆలయ అర్చకులు జనార్ధన్‌శర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు.

## శుభమస్తు షాపింగ్ మాల్‌చే...గంగమ్మ దేవస్థానంకు విరాళం



తిరుపతి హెల్త్, మే 4 ప్రభాతవార్త: శుభమస్తు షాపింగ్ మాల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో తిరుపతి గంగమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించు కొని శ్రీ శ్రీ శ్రీ తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, చైర్మన్‌కి బ్యారిగేట్స్, గోడ పత్రికలు, స్టిక్కర్స్, డస్ట్ బిన్స్‌లను శ్రీ బయ్యా వెంకట రమణయ్య శుభమస్తు మెమోరియల్ ఫౌండేషన్ తరపున సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్బంగా ఆలయ కమిటీ చైర్మన్ నైనారు మహేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా శుభమస్తు షాపింగ్ మాల్ మేనేజ్మెంట్ వారు 15 బ్యారిగేట్స్, 2000 గోడ పత్రికలు, 1000 స్టిక్కర్స్, 50 డస్ట్ బిన్స్‌లను విరాళంగా ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్బంగా శుభమస్తు షాపింగ్ మాల్ తిరుపతి బ్రాంచి మేనేజర్ మునిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా శుభమస్తు షాపింగ్ మాల్ మేనేజ్మెంట్ వారు 15 బ్యారిగేట్స్, 2000 గోడ పత్రికలు, 1000 స్టిక్కర్స్, 50 డస్ట్ బిన్స్‌లను విరాళంగా ఇవ్వడానికి సహకరించిన శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా వెంకట రవి కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. గంగమ్మ జాతర సందర్బంగా శుభమస్తు షాపింగ్ మాల్‌లో గంగమ్మ పెట్టుబడి వస్త్రాలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి సరసమైన ధరలలో వస్త్రాలను తిరుపతి పుర ప్రజల కోసం వుంచామని తెలియజేశారు. ఇవే కాకుండా మజ్జిగ చలివేంద్రం, 24 గంటల చల్లని నీటి చలివేంద్రంను ఏర్పాటు చేసి వేసవి తాపాన్ని తగ్గించటం కోసం బాటసారులకు ఉచితంగా పంపిణీ చేయటం జరుగుతుందని తెలియజేశారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన అధికారులు

రేణిగుంట, మే 4 ప్రభాతవార్త: రేణిగుంట తిరుపతి మార్గంలోని రేణిగుంట ముఖద్వారం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి అభివృద్ధి పనులను తహసిల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర, సర్వేయర్ కరుణాకర్, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా సమక్షంలో సోమవారం పరిశీలించారు. పనులు ఎప్పటికీ పూర్తవుతాయని కాంట్రాక్టర్ ను అడిగారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ అన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా కాంట్రాక్టర్ ను కోరారు. ప్రత్యామ్నాయంగా ఏర్పాటుచేసిన ఐదు కన్నుల (ఐదు కాణాల) బ్రిడ్జి కింద గుంటలను చదును చేయిస్తామని కాంట్రాక్టర్ ను పట్టణ అధ్యక్షుడు భాష అడుగగా రైల్వే అధికారులతో సంప్రదించాలని చెప్పారు. బ్రిడ్జి మూత కారణంగా రేణిగుంట పట్టణంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉందన్నారు. నిర్ణీత గడువు లోపల బ్రిడ్జి మరమ్మత్తు పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

## డయల్ యువర్ సిఎండికి 56ఫిర్యాదులు

తిరుపతి,మే 4 ప్రభాతవార్త: ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియో గదారులు విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో జాప్యాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 56 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 ,1800 425 155333కు కాల్ చేయడం,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## తిరుమల డిపో వజ్రోత్సవం



తిరుమల మే 4 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా సిసిఎస్ 75 వజ్రోత్సవం వేడుకల్లో భాగంగా తిరుమల డిపోలో ఉద్యోగు లందరికీ లంచ్ బాక్స్‌గిఫ్ట్‌గా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డెలికేట్ ధనుంజయులు, డిపో కార్యదర్శి ఎస్ ఆర్ బాబు, రమేష్ నాయక్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## పూరిగుడిసె దగ్ధం - రూ.30వేలదాకా నష్టం



పెద్దపంజాణి మే 4 ప్రభాతవార్త: మండలంలోని బసవరాజుకండ్రిగ గ్రామంలో విద్యుత్‌షాట్ సర్క్యూట్ కారణంగా పూరిగుడిసెలో మంటలుచెలరేగి పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారు30వేల రూపాయలకు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. గ్రామానికి చెందిన ఎల్లప్ప పూరిగుడిసెలో నివాసం ఉండేవాడు. ఆదివారం రాత్రి ఓ మహిళ మృతి చెందటంతో ఎల్లప్ప అక్కడికి వెళ్ళాడు.తిరిగి వచ్చే సమయానకి అతని పూరిగుడిసె దగ్ధమైంది. స్థానికులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నాలు చేయగా అప్పటికే మంటలు చెలరేగి పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది.దీంతో గుడిసెలోని బియ్యం, దుస్తులు, భూములకు సంబంధించిన పత్రాలు, 20వేల రూపాయల నగదుతోపాటు అన్నీ కాలిపోవడంతో సుమారు 30వేలకు పైగా నష్టం కలిగినట్లు ఎల్లప్ప వాపోయాడు.సంఘటనకు సంబందించి తహశీల్దార్, పోలీసులకు,విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.